క్లుప్తంగా

ప్రతిభతో మెరిసిన కాంతారావు



మచిలీపట్నం అర్బన్: స్థానిక పద్మావతి బీఎడ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న కలపర్తి కాంతారావు ఏపీ డీఎస్సీ 2025లో ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఒకేసారి నాలుగు విభాగాల్లో అర్హత పొందారు. రాష్ట్ర స్థాయిలో ప్రిన్సిపాల్ పోస్టులో 65వ ర్యాంక్, జోన్ స్థాయిలో పీజీటీ విభాగంలో ఒకటో ర్యాంక్, టీజీటీ విభాగంలో 27వ ర్యాంక్, అలాగే జిల్లా స్థాయిలో ఎస్ఏ సోషల్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులో 21వ ర్యాంక్ సాధించారు. నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్‌లో పీహెచ్‌డీ చేసిన కాంతారావు, డీఎస్సీలో ప్రిన్సిపాల్‌గా చేరడమే తన లక్ష్యమని చెప్పారు. ఒకేసారి నాలుగు విజయాలతో కాంతారావు స్థానికంగా విశేష ప్రశంసలు అందుకుంటున్నారు.

విద్యాశక్తి కార్యక్రమం బహిష్కరణ



మచిలీపట్నంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల ప్రారంభించిన విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమైఖ్య (ఫ్యాప్టో) కృష్ణాజిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఫ్యాప్టో నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జే. రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అల్పాహారం లేకుండా ఉండాల్సి రావడం, పాఠశాలల్లో పేనల్స్‌కు ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడం, ప్రతి తరగతిలో ఉపాధ్యాయులు తమ సొంత సెల్‌ఫోన్లతో కార్యక్రమం నిర్వహించాల్సి రావడం వంటి సమస్యలను ఫ్యాప్టో నాయకులు వివరించారు. కార్యక్రమంలో కనకారావు, హుస్సేన్, సూరిబాబు, శేషగిరి, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో తాగునీటి కష్టాలు అధికం



మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వ పాలనలో మచిలీపట్నం నగరపాలకసంస్థ పరిధిలో ప్రజలకు తాగునీటి సమస్యలు అధికమయ్యాయని మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్లో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి పాలకులు తమ పాలకవర్గాన్ని నిర్వీర్యం చేసి పాలనను అస్తవ్యస్తం చేశారన్నారు. నగర ప్రజలకు తాగునీటిని పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారని, అలాగే మురుగు, పురుగులు, దుర్వాసనతో కూడిన తాగునీటిని సరఫరా చేస్తున్నారని విమర్శించారు. తాగునీటి ఇబ్బందులను అధికారులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ డెప్యూటీ మేయర్ లంక సూరిబాబు, కార్పొరేటర్లు తిరుమలశెట్టి వరప్రసాద్, జోగి చిరంజీవి, పల్లి శేఖర్, మాజీ కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో పేలుడు పదార్థం పేలడంతో ఓ మహిళకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నం వైఎస్సార్ కాలనీకి చెందిన తిరుమల శ్రీను బస్టాండ్ సెంటర్‌లో స్క్రాబ్ షాపు నిర్వహిస్తుంటాడు. అతనితో పాటు అతని చెల్లెలు భాను షాపు నిర్వహణ చూస్తుంటుంది. మంగళవారం స్క్రాబ్ వస్తువులన్నీ సర్దుతుండగా ప్రమాదవశాత్తు ఓ వస్తువు పెద్ద శబ్దంతో పేలి మంటలు రేగాయి. ఈ ఘటనలో భాను చేయి అక్కడికక్కడే తెగి పడిపోయింది. తోటి వ్యాపారులు చికిత్స నిమిత్తం ఆమెను మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. పేలిన వస్తువు ఏంటనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

చవితి సంబరాలకు పందిళ్లు సిద్ధం

- భారీ విగ్రహాల ఏర్పాటు
- ఆకర్షణీయంగా మండపాలు

చల్లపల్లి/అవనిగడ్డ: వినాయక చవితిని పురస్కరించుకుని విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు గ్రామాలు, ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా పందిళ్లు ఏర్పాటుచేసి ముస్తాబు చేశారు. వివిధ రూపాలు, ఆకారాల్లో రంగు రంగుల అలంకరణలో ఉన్న వినాయక విగ్రహాలను తీసుకువచ్చి వ్యాపారులు అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను కూడా ప్రత్యేకంగా తయారు చేయించినట్లు తెలిపారు.

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో ఏర్పాటు చేసే మట్టి వినాయకుని పూజకు మందిరాన్ని అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన గుడి సెంటర్‌లో మంగళవారం అంగళ్లలో మట్టి వినాయకుని విగ్రహాలతో పాటు స్వామివారి పూజలకు అవసరమైన పూజా సామగ్రి, పండ్లు, పూలతో నిండిపోయాయి.

పెడనలో..

పెడన: గణేష్ నవరాత్రులకు పెడనలో తయారైన గణపతి ప్రతిమలను జేజేలు పలుకుతూ తీసుకువెళ్లారు. మరోపక్క పెడన మార్కెట్‌లో పండ్లు, పూలు, పత్రి దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పూలదుకాణంలో రూపాయి నాణాలతో వినూత్నంగా దండలు తయారు చేసి విక్రయించడం విశేషం. వంద దండలు తయారు చేసి విక్రయిస్తున్నామని సుమారు 90 దండల వరకు అమ్ముడుపోయినట్లు దుకాణా యాజమాని ముస్తాఫా తెలిపారు.

జోరుగా పత్రి అమ్మకాలు

మచిలీపట్నంటౌన్: వినాయక చవితి సందర్భంగా పూజకు అవసరమైన పత్రి విక్రయాలు నగరంలో మంగళవారం జోరుగా సాగాయి. పత్రి, పలు రకాల పండ్లు, పూలు, రంగురంగుల గొడుగులు, పాళీలను కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో నగరంలోని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన దుకాణాలు కిటకిటలాడాయి.



చల్లపల్లిలో వివిధ ఆకారాల్లో వినాయకుని ప్రతిమలు



పెడనలో గణపతి విగ్రహాన్ని వ్యానులోకి ఎక్కిస్తున్న యువకులు



మోపిదేవి దేవస్థానంలో గణనాథుని పందిరి



చల్లపల్లిలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం

కృత్తివెన్ను: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గ్రామగ్రామాన వినాయక మండపాలు ఏర్పాటు చేసి గణనాథుని ప్రతిష్ఠిస్తున్నారు. ఆలయాల వద్ద భారీ చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు.

బంటుమిల్లి: మండలంలో గణపతి నవరాత్రుల సందర్భంగా మంగళవారం స్థానికంగా పలు కూడళ్ల వద్ద భక్తుల రద్దీతో సందడి నెలకొంది. బయట ప్రాంతాల నుంచి మామిడి ఆకులు, కలువపూలు తదితర పత్రితోపాటు పాలీలు విక్రయించారు. అలాగే స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చవితి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గ్రామాల్లో చవితి సందడి



కోడూరు: గ్రామాల్లో వినాయక చవితి సందడి ప్రారంభమైంది. మండపాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో గణనాథుడి విగ్రహాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.



పెడనలో రూపాయి నాణాలతో వినూత్నంగా రూపొందించిన దండలు

వినాయకుని ప్రతిమల పంపిణీ

చల్లపల్లి: స్థానిక లయన్స్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ముస్లిం మతపెద్దలు వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. 400 వినాయకుని విగ్రహాలు పంపిణీ చేశారు.

నాగాయలంక: అవనిగడ్డ డీఎస్పీ తాళ్ళూరి విద్యాశ్రీ మంగళవారం స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 68వ వార్షిక వినాయక నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. కమిటీ సభ్యులు మట్టి గణపతి ప్రతిమలను డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. అవనిగడ్డ సీఐ పి.యువకుమార్, ఎస్.ఐ కలిదిండి రాజేష్, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

గూడూరు: మండల పరిధిలోని రామరాజుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేశారు. గూడూరు ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాల సెంటర్లో పోలీసులు 100 మట్టి వినాయక విగ్రహాలను ఎస్ఐ ప్రతాప్ రెడ్డి చేతులు మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



నాగాయలంకలో భక్తులకు వినాయక ప్రతిమలు అందజేస్తున్న డీఎస్పీ విద్యాశ్రీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని శ్రీ పద్మావతి మహిళా హిందూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింగరాజు భారతి ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి విగ్రహాల పంపిణీని ప్రకృతి ప్రేమికులు అభినందించారు.

చల్లపల్లి: చల్లపల్లి ప్రెస్‌క్లబ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన స్థానిక ప్రధాన సెంటర్లో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీచేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పేరం మధుసూధనరెడ్డి, జాయింట్ సెక్రటరీ షేక్ ఎజాజ్ అహ్మద్, ఉపాధ్యక్షుడు నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



మోపిదేవి: మోపిదేవిలో పలు ఎరువుల షాపులతో పాటు పీఏసీఎస్ గోడౌన్లను వ్యవసాయశాఖ ప్రత్యేక బృందం మంగళవారం తనిఖీ చేసింది. మోపిదేవి పీఏసీఎస్, సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్‌లో రికార్డులు పరిశీలించి స్టాక్‌ను తనిఖీ చేశారు. యూరియా స్టాక్ వివరాలు సేకరించి, రైతులకు ఎంత ధరకు విక్రయిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. యూరియా కొంటే మరొక ఎరువుల కట్ట, గుళికలు కొనుగోలు చేయాలని ఆంక్షలు పెట్టవద్దని స్పష్టంచేశారు. ప్రత్యేక అధికారి లీలా, ఏఓ హెప్సిబారాణి, ఎస్ఐ సత్యనారాయణ, ఎంఆర్ఐ విశ్వనాథం పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని పలు ఎరువుల షాపుల్లో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డీఎస్పీ బంగారురాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో తరకటూరు చెన్నకేశవ ఫెర్టిలైజర్స్, కంకటావలోని జయ గణేష్ ట్రేడర్స్‌లో రిజిస్టర్లకు, స్టాకు మధ్య వ్యత్యాసం ఉండటంతో ఎరువుల అమ్మకాలను రద్దు చేసినట్లు గూడూరు ఏఓ జి.శివరామకృష్ణ తెలిపారు. తనిఖీల్లో ఎక్కడా యూరియా అక్రమ నిల్లలు లభ్యం కాలేదని ఆయన తెలిపారు.

కొడాలి(ఘంటసాల): ఘంటసాల మండలంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం తనఖీలు నిర్వహించారు. ఘంటసాల మండలంలోని ఐదు పీఏసీఏస్‌లు, 11 ప్రైవేటు డీలర్ల షాపుల్లో తనఖీలు చేసినట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి, ఇన్‌చార్జి ఏఓ రామ్మోహనరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రేపటి నుంచి సదరం క్యాంపులు

గూడూరు: ఆగస్టులో నోటీసులు జారీ అయి సదరం శిబిరానికి హాజరుకాని దివ్యాంగ పెన్షన్ లబ్ధిదారులకు మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో ఈనెల 28 నుంచి సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గూడూరు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కె.వి.రామకృష్ణ తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

వాహనానికి వారెంటీ పీరియడ్ పెంచండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారుని వాహనానికి కొత్త డిజిటల్ మీటర్‌ను అమర్చడంతో పాటు మరో 15 నెలలు వారెంటీ పీరియడ్‌ను పెంచాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు నందిపాటి పద్మారెడ్డి, సభ్యురాలు శ్రీలక్ష్మీరాయలు మంగళవారం తీర్పు చెప్పారు. పెడనకు చెందిన కర్ర జాన్‌రాజు మచిలీపట్నంలోని కాసా మోటార్స్ టీవీఎస్ షోరూమ్‌లో జూపిటర్ టూ వీలర్ వాహనాన్ని 2024 ఏప్రిల్ 9న రూ. 1.06 లక్షలకు కొనుగోలు చేశారు. వాహనం కొనుగోలు చేసిన నెలలో జుల్లోపే డిజిటల్ మీటర్ పనిచేయడం ఆగిపోయింది. 15 రోజుల్లో రిపేరు చేసి ఇస్తామని చెప్పి ఎన్ని నెలలు గడిచినా రిపేరు చేయలేదు, వాహనం ఇవ్వలేదు. అలా 15 నెలలు గడిచినప్పటికీ వాహనం అప్పచెప్పకపోవడంతో జాన్‌రాజు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సభ్యులు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం వాహనాదారుని బండికి కొత్త డిజిటల్ మీటరును అమర్చడంతో పాటు 15 నెలలు పాటు వారెంటీ పీరియడ్‌ను పెంచాలని, మానసిక వేదనకు రూ. 25 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా అందజేయాలన్నారు.

మట్టి నాణ్యత ప్రమాణాలపై శిక్షణ

ఘంటసాల: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఘంటసాల ఆధ్వర్యంలో యువతకు చేపలు, రొయ్యల చెరువుల్లో నీరు, మట్టి నాణ్యతా ప్రమాణాలపై శిక్షణను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ చేపలు, రొయ్యల చెరువుల్లో మట్టిలో ఉండాల్సిన పోషకాలు, కేవీకే ద్వారా యువతకు అందిస్తున్న వివిధ శిక్షణ కార్యక్రమాలను తెలిపారు. మత్స్యశాఖ శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

10వ రోజు నిమజ్జనం వద్దు

పెడన: వినాయకుని విగ్రహాల నిమజ్జనం 9 లేదా 11వ రోజున దాటిన తర్వాతే చేసుకోవాలని పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. 10వ రోజు మిలాదున్ బీ ముస్లిం పండుగ ఉన్న నేపథ్యంలో ఆ రోజు ఊరేగింపులు వద్దని చెప్పారు. పీస్ కమిటీకి కూడా ఇదే విషయాన్ని పోలీసులు తెలిపారు. పెడన బస్టాండు ముస్లింలు ఉండే ప్రాంతం కాబట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా వినాయక చవితి, మీలాదున్ బీ పండుగలు నిర్వహించుకోవడానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

గ్రామ నమూన చిత్రపటం

ఘంటసాల: ఘంటసాల రామాలయం వద్ద సామాజిక కళాశాల విద్యార్థినులు మంగళవారం గ్రామ నమూనా పటాన్ని మంగళవారం చిత్రీకరించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు విద్యార్థులతో మాట్లాడుతూ గ్రామాల మూల పటాల యొక్క ఉద్దేశాన్ని వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

చల్లపల్లి: బాల్య వివాహాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని మొవ్వ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశ్రాంతమ్మ పేర్కొన్నారు. మొవ్వ మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక నిమ్మలతోటలో బాల్య వివాహాల నిషేదం, చిన్నతనంలో గర్భం దాల్చడంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీవో పి.వెంకటేశ్వరరావు, మొవ్వ ప్యానల్ లాయర్ పరిశి సరస్వతి, న్యాయవాది ప్రసాదు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గూడూరు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ కంకటావ శివారు షాఅబ్దుల్లాపాలెంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. విషజ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. మల్లవోలు పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఘంటసాల/మెరకనపల్లి(మోపిదేవి): ఘంటసాల, మోపిదేవి మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

30న కౌన్సిల్ సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

సహనంతో లక్ష్యాలు సాధ్యం

చల్లపల్లి: సహనంతో లక్ష్యాలు సాధించవచ్చని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక విజయ జూనియర్ కళాశాల 'ఫ్రెషర్స్ డే'ను చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చక్కని క్రమశిక్షణ కలిగి ఉండి చదువుతోపాటు మానవత్వాన్ని మేల్కొలిపి సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం, సర్పంచ్ పి.కృష్ణకుమారి, విజయ అకాడమీ ప్రిన్సిపాల్ నాదేళ్ల భీమారావు పాల్గొన్నారు.

ముగిసిన సబ్‌జోన్ క్రీడాపోటీలు



కోడూరు: అవనిగడ్డ సబ్‌జోన్ క్రీడాపోటీలు మంగళవారంతో ముగిశాయి. మండలంలోని వి.కొత్తపాలెం జెడ్పీ పాఠశాల క్రీడాప్రాంగణంలో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో పులిగడ్డ ఏపీఆర్ఎస్ (ప్రథమ), తలగడదీవి జెడ్పీ పాఠశాల (ద్వితీయ), బాలికల విభాగంలో లింగారెడ్డిపాలెం జెడ్పీ(ప్రథమ), అవనిగడ్డ హైస్కూల్ (ద్వితీయ) విద్యార్థులు స్థానాల్లో నిలిచారు. రన్నింగ్ పోటీల్లో 100మీటర్ల విభాగంలో లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థిని మధుప్రియ ప్రథమ స్థానం, శ్రీకాకుళం జెడ్పీ విద్యార్థిని కే.పూజిత ద్వితీయస్థానంలో నిలిచారు. 400 మీటర్ల విభాగంలో బి.దివ్య (లింగారెడ్డిపాలెం జెడ్పీ), వి.ప్రసన్నకుమారి (తలగడదీవి జెడ్పీ) ప్రథమ, ద్వితీయస్థానాలు. చెస్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఏ.స్నేహశ్రీ (వి.కొత్తపాలెం జెడ్పీ), వి.ప్రజ్వల (అవనిగడ్డ బాలికల హైస్కూల్), అండర్-17 విభాగంలో వి.భవ్యశ్రీ (అవనిగడ్డ బాలికల హైస్కూల్), ఎస్.గువేరి (చల్లపల్లి) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి



అవనిగడ్డ: నోబెల్ అవార్డు గ్రహీత, భారతరత్న మదర్ థెరిస్సా జయంతిని మండలంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పంచాయితీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చింతలపూడి బాలు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: మదర్ థెరిసా జయంతిని చిలకలపూడిలోని ఆమె విగ్రహం వద్ద నిర్వహించారు. పలువురు ఆమె విగ్రహానికి నివాళులర్పించారు.

కోడూరు: మదర్ థెరిసా జయంతిని టీఎస్సార్ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గ్రూప్ చైర్మన్ తిరుపతి శ్రీనివాసరావు థెరిసా చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



నాగాయలంక: రాష్ట్రస్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు నాగాయలంక జెడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అలపర్తి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈనెల 25న నున్నలోని వికాస్ కళాశాలలో జరిగిన జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్లు ఎంపికలో పాఠశాలకు చెందిన బాలికలు పి.లీలశ్రీ, జి.హాసిని, పి.వల్లీశ్రీ, టి.తనూష, ఎం.సిరి, ఎస్ మేఘన, ఎం.జ్యోతిరాణి, సబ్బినేని ఉస్మిత ఎంపికయ్యారని చెప్పారు. వీరంతా వచ్చేనెల 21, 22 తేదీల్లో విశాఖపట్నం జిల్లా వాల్తేరులో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన బాలికలను హెచ్.ఎం సత్యనారాయణ, పి.డి గాజుల లక్ష్మీప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలామారుతి అభినందించారు.